

తుది దశకు బదిలీ ప్రక్రియ

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉపాధ్యాయుల దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన అధికారులు తుది సీనియారిటీ జాబితాలు విడుదల చేశారు.

8లో



పక్కాగా.. పారదర్శకంగా

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు మరో వారం రోజుల్లో రానున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలల వివరాలతో జేఎన్‌టీయూకే వెబ్ పోర్టల్ ప్రారంభించింది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
44.5°/28.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	44.5	28.0
కాకినాడ	39.9	28.5
అమలాపురం	41.0	29.0

న్యూస్‌రీల్

నేడు సీఎం వైఎస్ జగన్ రాక



మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రానున్నారు. మలికిపురం మండలం కత్తిమండ గ్రామంలో జరిగే రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తనయుడి వివాహ వేడుకలో సీఎం పాల్గొంటారు. తాడేపల్లి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.55 గంటలకు హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మలికిపురం చేరుకుంటారు. ఇక్కడి సత్యజ్యోతి థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో బయలుదేరి కత్తిమండలోని ఎమ్మెల్యే రాపాక నివాసానికి చేరుకుంటారు. వధూవరులను ఆశీర్వదిస్తారు. మహిళా సంఘాల సభ్యులతో ఇంటరాక్ట్ అవుతారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. సాయంత్రం ఐదు గంటలకు తిరిగి తాడేపల్లి చేరుకుంటారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.

జిల్లా ఉపాధి కల్పన అధికారిగా శ్రీనివాస్



శ్రీనివాస్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కల్పన అధికారిగా జి.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆయన శ్రీకాకుళం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కుసుమశాంతి విశాఖపట్నం బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

ముత్తూట్ ఫైనాన్స్, సర్వారాయ సుగర్స్ సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దీనికి హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి రూ.16 వేల నుంచి రూ.27 వేల వరకూ వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 0884-2373270 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు 25 మంది ఎంపీడీఓలు

కాకినాడ సిటీ: జిల్లాకు 25 మంది ఎంపీడీఓలను కేటాయించారు. జెడ్పీ ఆధ్వర్యాన వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరందరినీ జిల్లాలోని వివిధ మండలాలకు కేటాయిస్తూ జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికీ బుధవారం మండలాలు కేటాయిస్తూ బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

పారిశ్రామిక కాంతిరేఖలు

- కేఎస్ఈజెడ్‌లో తొలి అడుగుకు ప్రజామోదం
- 'కోన'లో పరిశ్రమలకు మెజారిటీ మొగ్గు
- స్థానికుల ఉపాధి కల్పనకు అధికారుల హామీ
- కాలుష్య రహితంగా ఏర్పాటు చేయాలని జనం విన్నపం



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న పరిసర గ్రామాల ప్రజలు



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ తీరంలో పారిశ్రామికీకరణకు ప్రజలు పచ్చజెండా ఊపారు. దీనికి కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి(కేఎస్ఈజెడ్)లో తొలి అడుగు పడింది. సుమారు రూ.2,500 కోట్లతో దాదాపు 4 వేల ఎకరాల్లో ప్రతిపాదించిన మల్టీప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఇండస్ట్రియల్ పార్కుకు ప్రజామోదం లభించింది. ఈ పార్కు ఏర్పాటుపై తొండంగి మండలం పెరుమాళ్లపురంలో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్ కుమార్ ఆధ్వర్యాన మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఇందులో పారిశ్రామికీకరణకు మెజారిటీ ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. రోడ్డు, రైల్వే, సముద్ర రవాణాకు అనుకూలంగా ఉన్న ప్రాంతాన్ని ఇందుకు ఎంపిక చేశారు. గత పాలకుల నిర్వాకంతో పదేళ్ల పాటు అతీగతీ లేకుండా పోయిన కేఎస్ఈజెడ్‌లో ఇక నుంచి పారిశ్రామిక కాంతి రేఖలు ప్రసరించనున్నాయి.

నాడు పోలీసు వలయంలో..

చంద్రబాబు పాలనా కాలంలో కేఎస్ఈజెడ్‌లో పరిశ్రమల కోసం ప్రజాభిప్రాయ సేకరణ అంటే వందలాది మంది పోలీసులు మోహరించేవారు. గ్రామాలకు గ్రామాలు ప్రైవేటు సైన్యం నిర్బంధంలో ఉండేవి. ఈ పరిస్థితి కోన ప్రాంతంలో నెలల తరబడి ఉండేది. గ్రామాల్లో పెదవి విప్పుతారనుకున్న ముఖ్య నాయకులను గృహనిర్బంధం చేసేవారు. స్థానికేతరులను రానిచ్చేవారు కాదు. పోలీసు పహారా మధ్య ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అప్పట్లో ఒక రకంగా పోలీసు రాజ్యమే నడిచింది. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన వారు నాటి పాలకులకు అనుకూలంగా మాట్లాడాలే తప్ప తమ వాదన వినిపించే స్వేచ్ఛ లేకుండా కట్టడి చేసేవారు. చంద్రబాబు హయాంలో కేఎస్ఈజెడ్‌లో ఒక్క ప్రాజెక్టు కూడా వచ్చిన దాఖలాల్లేవు.

నేడు స్వేచ్ఛా వాతావరణంలో..

నాటి పరిస్థితికి భిన్నంగా, పూర్తి స్వేచ్ఛా వాతావరణంలో ఈసారి ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. తొండంగి, యు.కొత్తపల్లి మండలాల పరిధిలోని పెరుమాళ్లపురం, ఏవీ నగరం, కోదాడ, శృంగవృక్షం, పొన్నాడ, రమణక్కపేట, కొత్తమూలపేట, శ్రీరామపురం, శృంగవృక్షం, పెరుమాళ్లపురం తదితర 15 గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను నిర్భయంగా అధికారుల ముందు ఉంచారు. ఐదారు వందల మంది గ్రామస్తులు హాజరైన ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఆద్యంతం ప్రశాంతంగా సాగింది. సుమారు 36 మంది తమ అభిప్రాయాలు వెల్లడించారు. మరో 60 మంది రాతపూర్వకంగా విజ్ఞాపనలు ఇచ్చారు. పారిశ్రామికీకరణను స్వాగతిస్తూనే కనీస మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇక్కడ తయారయ్యే ఎలక్ట్రానిక్, సోలార్, ఎరువులు, పురుగు మందులు తదితర ఉత్పత్తులు కాలుష్య రహితంగా ఉండాలని ఆకాంక్షించారు. గత పాలనలో పేరుకే కేఎస్ఈజెడ్ వచ్చిందని, జాబ్ కార్డులు ఇచ్చారని, కానీ ఎవ్వరికీ ఉపాధి చూపించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయిన వారందరికీ ఉపాధి కల్పించాలనే విజ్ఞప్తికి ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రతినిధులు, కేఎస్ఈజెడ్ డైరెక్టర్ ఒ.రామిరెడ్డి సానుకూలంగా స్పందించారు. చదువుతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించేందుకు కార్యాచరణ సిద్ధంగా ఉందని స్పష్టత ఇచ్చారు. కాలుష్య రహిత పరిశ్రమలను నిరభ్యంతరంగా ఏర్పాటు చేసుకోవచ్చని మెజారిటీ ప్రజలు సానుకూలత వ్యక్తం చేశారు. వేలాది మంది ఆధారపడి ఉన్న హేచరీలకు ఎటువంటి ఇబ్బందీ కలగని రీతిలో వ్యర్థ జలాలను ప్రత్యేక పైపులైన్ ద్వారా సముద్ర తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టాలని ఆలిండియా ష్రింప్ హేచరీస్ ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి సూచించారు. దీనిపై గతంలో తమకు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. ప్రజల సందేహాలను కలెక్టర్ కృతికా శుక్లా కేఎస్ఈజెడ్ ప్రతినిధుల ద్వారా నివృత్తి చేశారు.

స్థానిక యువతకు ప్రాధాన్యం



ఇక్కడి పరిశ్రమల కోసం రైతులు తమ భూములు ఇచ్చారు. వీటిల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే ఇవ్వాలి. అందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– కొయ్య మురళీకృష్ణ, తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఏవీ నగరం

కోన తీర ప్రాంతంలో ప్రగతి బాట



పరిశ్రమల ఏర్పాటు ద్వారా కోన తీర ప్రాంతం సమగ్రాభివృద్ధి చెందుతుంది. కాలుష్య రహిత పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. స్థానికంగా విద్యారంగ అభివృద్ధితో పాటు, మౌలిక వసతులు బాగా పెరుగుతాయి. ఇతర ప్రాంతాలతో సంబంధాలు మరింత పెరుగుతాయి.

– పి.ప్రవీణ్ కుమార్, టీచర్, పెరుమాళ్లపురం

నష్టపరిహారం ఇవ్వాలి



కోనపాపపేటలో 100కు పైబడి ఫైబర్ మెకనైజ్డ్ బోట్లున్నాయి. వాటిపై ఆధారపడి జీవిస్తున్న 1,500 కుటుంబాల వారు జీవనోపాధి కోల్పోతున్నారు. కేఎస్ఈజెడ్ మత్స్యకారులకు జీవనోపాధి నష్టపరిహారం ఇచ్చినట్లుగానే మాకూ ఇవ్వాలి.

– కొర్ని వెంకట రమణ, అధ్యక్షుడు, శ్రీరామ వాడబలిజ మత్స్యకార సేవా సంఘం, కోనపాపపేట

స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి



ఉద్యోగ, ఉపాధి కల్పనలో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇస్తాం. పరిశ్రమలతో భూగర్భ జలాలకు ఎటువంటి ఇబ్బందీ ఎదురు కాదు. పారిశ్రామిక అవసరాల కోసం నీటిని కాలువలు, ఎగువ నుంచి వచ్చే వర్షపు నీటి ద్వారా సేకరిస్తాం. లేకుంటే సముద్ర జలాలను శుద్ధి చేసి వినియోగించుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ భూగర్భ జలాలను కలుషితం కానివ్వం. కేంద్ర పర్యావరణ చట్టాలకు అనుగుణంగానే కాలుష్య రహితంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. మల్టీపర్పస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి, యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాం.

– ఒ.రామిరెడ్డి, డైరెక్టర్, కేఎస్ఈజెడ్

పర్యావరణ నిబంధనల మేరకే..



ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. స్థానికంగా అనేక సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో రోడ్లు అడిగారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగావకాశాలు దండిగా లభిస్తాయి. కేంద్ర పర్యావరణ నిబంధనలకు అనుగుణంగానే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిస్తాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగని రీతిలోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

చేనేతకు ప్రపంచ స్థాయి మార్కెట్ కల్పించడమే లక్ష్యం

పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



తాటిపర్తిలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

పిఠాపురం: చేనేత వస్త్రాలకు ప్రపంచ స్థాయి మార్కెట్ కల్పించడమే లక్ష్యంగా ఆప్కో ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్ చేపట్టామని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింక విజయలక్ష్మి తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చేనేత కుటుంబాలను మంగళవారం ఆమె కలుసుకున్నారు. వారి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో పద్మశాలీ కుటుంబాలు 8 శాతం ఉన్నాయని, చేనేతపై 13 శాతం చేనేత కులాలు ఆధారపడి ఉన్నాయని, వీరి అభివృద్ధి కోసం రాష్ట్రమంతా పర్యటిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.24 వేల ఆర్థిక సహాయం అందజేస్తూ నిరుపేద చేనేత కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో నేత కార్మికులు నేత ఆగిపోయి నానా కష్టాలూ పడుతూంటే ఆరు నెలల ముందే నేతన్న నేస్తం నిధులు అందించారని గుర్తు చేశారు. చేనేత కార్మికులు 50 ఏళ్లకే దృష్టి, కాళ్ల వ్యాధులకు గురవుతారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని చెప్పారు. చేనేత వస్త్రాలపై జీఎస్‌టీ ఎత్తివేయాల్సిందిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారని, త్వరలోనే సానుకూల స్పందన వచ్చే అవకాశాలున్నాయని విజయలక్ష్మి తెలిపారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఎంపీలు పలుమార్లు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారన్నారు. గత టీడీపీ హయాంలో ఆప్కోలో జరిగిన రూ.4 వేల కోట్ల అవినీతికి సంబంధించి అప్పటి చైర్మన్ బుజ్జల శ్రీనివాస్‌పై విచారణ జరుగుతుందని చెప్పారు. 2024 నాటికి ఆప్కోను లాభాల బాట పట్టించేందుకు సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి, మోసం చేశారని, ఇప్పుడు మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వాటిని నమ్మే పరిస్థితిలో నేత కార్మికులు లేరని విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, ఎంపీటీసీ సభ్యుడు నూక రాజు, చేనేత సొసైటీ అధ్యక్షుడు తుమ్మూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం

- తారెత్తిస్తున్న రేటు
- రైతుబజారులో రూ.230
- బహిరంగ మార్కెట్‌లో రూ.300 పైనే..



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దాదాపు ఏ కూర వండాలన్నా అల్లం తప్పనిసరి. కానీ, ప్రస్తుతం దీని రేటు వింటే జనం తారెత్తిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అల్లం ధర ఆకాశాన్నంటుతోంది. ఇరవై రోజుల కిందట కిలో అల్లం ధర రూ.60 నుంచి రూ.80 మధ్య ఉండేది. ప్రస్తుతం రైతుబజారులో కిలో అల్లం రూ.230కి, బహిరంగ మార్కెట్‌లో రూ.300 పైన విక్రయిస్తున్నారు. జిల్లాలో అల్లం సాగు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి జిల్లాకు ప్రతి రోజూ 30 టన్నులకు పైగా అల్లం దిగుమతి అవుతోంది. జిల్లాలోని పెద్దాపురం, కాకినాడలోని గాంధీ నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజార్లలో రోజూ మూడు నాలుగు టన్నుల అల్లం విక్రయాలు జరుగుతాయి.

ఒడిశా నుంచి దిగుమతులు లేక..

గతంలో ఒడిశా నుంచి జిల్లాకు ప్రతి రోజూ 15 నుంచి 20 టన్నులు, మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి 10 నుంచి 15 టన్నుల అల్లం జిల్లాకు దిగుమతి అయ్యేది. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా 20 రోజులుగా ఒడిశా నుంచి అస్సలు అల్లం దిగుమతి జరగడం లేదు. దీంతో మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి వస్తున్న అల్లంపైనే ఆధారపడాల్సి వస్తోంది. దీనికితోడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో పండే ముక్క అల్లం కూడా ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోయింది. సరిగ్గా ఇదే సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో అల్లం వినియోగం ఒక్కసారిగా పెరిగిందని కాకినాడలోని హోల్‌సేల్ వ్యాపారి గోవిందరాజులు చెప్పారు. శుభకార్యాలకు కూరగాయలు కొనుగోలు చేసేవారు ప్రతి రోజూ పది మందికి పైగా తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. వీటన్నింటి ఫలితంగా అల్లం ధర ఆకాశమే హద్దుగా రోజురోజుకూ పెరుగుతోంది. ఒడిశా నుంచి దిగుమతులు మొదలైతే తప్ప అల్లం ధరలు తగ్గుముఖం పట్టే అవకాశాలు లేవని, మరో 20 రోజుల వరకూ అక్కడి నుంచి దిగుమతి అయ్యే పరిస్థితులు లేవని వ్యాపారులు చెబుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతోంది



హోల్‌సేల్ వ్యాపారులు రోజురోజుకూ రేటు పెంచడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైతు బజారుకు వచ్చే కొనుగోలుదారులు అల్లం ధర చూసి హడలిపోతున్నారు. గతంలో రూ.10కి అల్లం ఇచ్చేవాళ్లం. ప్రస్తుతం 100 గ్రాముల అల్లం రూ.23 కావడంతో కొనుగోలుదారులు కొనాలంటేనే ఆలోచిస్తున్నారు. దీంతో వ్యాపారం కూడా సాగడం లేదు.

– ప్రగడ కృష్ణ, అల్లం వ్యాపారి, గాంధీనగర్ రైతుబజార్, కాకినాడ

సత్యదేవుని సన్నిధిలో సమూల మార్పులు

- గర్భాలయ ప్రదక్షిణ పునరుద్ధరణ
- పండితుల సూచనలతో పలు చర్యలు
- 'సాక్షి'తో ఈఓ చంద్రశేఖర్ అజాద్



అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం వాస్తు పండితులు, విశ్రాంత అర్చకులు, పురోహితుల సలహాలు, సూచనల మేరకు పలు మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఈ విషయం తెలిపారు. దేవస్థానంలో చేపడుతున్న వివిధ మార్పులపై ఆయన మంగళవారం 'సాక్షి'తో ముచ్చటించారు. దేవదాయ శాఖ ఆగమ కమిటీ సలహాదారు, శ్రీశైలం దేవస్థానం ఆస్థాన వాస్తు సిద్ధాంతి బుట్టే వీరభద్ర దైవజ్ఞ సిద్ధాంతి, అన్నవరం దేవస్థాన వైదిక కమిటీ, విశ్రాంత అర్చకుడు నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత వ్రతబ్రహ్మ, దేవస్థానం వైదిక సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, దివంగత ప్రధానార్చకుడు కోట శ్రీనివాసశర్మ, వాస్తు పండితులు లిఖితపూర్వకంగా ఇచ్చిన సలహాలు సూచనల మేరకు ఈ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ప్రధానాంశాలివీ..

- బుట్టే వీరభద్ర దైవజ్ఞ సిద్ధాంతి అన్నవరం వచ్చినప్పుడు గర్భాలయ ప్రదక్షిణ, ఆలయంలో చేయాల్సిన మార్పులు సూచించారు. గతంలో గర్భాలయ ప్రదక్షిణ ఉండేదని నాగాభట్ల సత్యనారాయణ, నాగాభట్ల కామేశ్వరశర్మ చెప్పారు. వీఐపీలకు కూడా గర్భాలయ ప్రదక్షిణ ఉండేది. దానిని ఇప్పుడు పునరుద్ధరించాం.
- గతంలో ఉత్సవ మూర్తులు ప్రధానాలయంలో కాకుండా దర్బారు మంటపంలోనే ఉండేవి. ముఖ్యమంత్రి, ఇతర వీవీఐపీలకు ఆలయంలో స్వామివారి సన్నిధిలోనే వ్రతాలు చేయించేవారు.



ఆలయం ఈశాన్య భాగంలో గోడలు తొలగించి ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్



గర్భాలయ ప్రదక్షిణకు క్యూలో నిలుచున్న భక్తులు

యాగశాల వద్ద పుష్కరిణి


సత్యదేవుని ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందేందుకు, దేవస్థానం మరింత అభివృద్ధి చెందేందుకు వాస్తు పండితుల సలహాతో రత్నగిరిపై ఈశాన్య దిశలో పుష్కరిణి నిర్మించనున్నాం. యాగశాల ముందున్న తోటలో చతురస్రాకారంలో పుష్కరిణి నిర్మిస్తాం. ప్రతి రోజూ తెల్లవారుజామున స్వామి వారికి ఇక్కడి నుంచే తీర్థపు బిందె వెళ్లేలా ఏర్పాట్లు చేస్తాం.

- సత్యదేవుని గర్భాలయ ప్రదక్షిణపై భక్తులు చాలా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.200 టిక్కెట్ తీసుకున్న భక్తులను ఈ ప్రదక్షిణకు అనుమతిస్తున్నాం. ఈ ప్రదక్షిణ మార్గంలో త్వరలో ఏసీలు ఏర్పాటు చేయిస్తాం.
- సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలకు గత సంవత్సరం కన్నా ఈ ఏడాది ఖర్చు తక్కువ. 2022లో రూ.83.70 లక్షలు కాగా, 2023లో రూ.70.26 లక్షలు మాత్రమే ఖర్చయ్యింది.

దేవస్థానంలో చేపట్టే నిర్మాణాలివీ..

- తూర్పు రాజగోపురం ముందు పురాతన రావిచెట్టు వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో దీపారాధన చేస్తున్నారు. దీనివలన ఆ చెట్టుకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అందువలన ఆ చెట్టు చుట్టూ ఇంకా విశాలమైన చప్టా నిర్మించి, రావి చెట్టు చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసేలా పక్కనే ఉన్న శ్లాబును మరింత విస్తరించి, అక్కడ దీపారాధన ఏర్పాట్లు చేయనున్నాం.
- అర్చకుల ఇబ్బందుల దృష్ట్యా నివేదన శాలను స్వామివారి ఆలయానికి సమీపంగా దక్షిణ భాగంలో రూ.800 వ్రత మంటపంపై 40 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పున నిర్మిస్తాం.
- ఆలయ ప్రాకారం నుంచి యాగశాలకు నేరుగా వెళ్లేందుకు తూర్పు మార్గంలో 8 అడుగుల వెడల్పున మెట్లు నిర్మించనున్నాం.
- ధ్వజస్తంభంపై ఉన్న శ్లాబును చతురస్రాకారంలో 4 అడుగుల మేర తొలగించి, ఆకాశం కనిపించేలా ఏర్పాటు చేయనున్నాం.
- స్వామివారి ఆలయం వద్ద భక్తులు ఎక్కే, దిగే మెట్లు ప్రస్తుతం నాలుగడుగుల వెడల్పు మాత్రమే ఉన్నాయి. వీటిని ఆరడుగులకు విస్తరిస్తాం.
- స్వామివారి ఉచిత దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం లిఫ్టు పక్కన సెల్లార్ మంటపం లోపల నుంచి క్యూ ఏర్పాటు చేస్తాం. ఆలయ ప్రాకారంలో క్యూలు తీసివేస్తాం, ఇప్పటికే సెల్లార్‌లోని గోడౌన్లలో వస్తువులను తీయించేశాం. దీంతో రథపాత్ మరింత విశాలమవుతుంది.
- దర్బారు మంటపం ఫ్లోరింగ్ వాస్తుకు విరుద్ధంగా ఎత్తుగా ఉంది. దీని ఎత్తు తగ్గిస్తున్నాం. మంటపాన్ని విశాలంగా చేసి క్యూ ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయి. దర్బారు మంటపంలో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను దర్శించి, క్యూలో తీర్థ ప్రసాదాలు స్వీకరించి బయటకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
- ఆలయం ఈశాన్య భాగం గోడలతో మూసివేసి ఉంది. ఆ గోడలు తొలగించి, గ్రిల్స్ ఏర్పాటు చేసి గాలి, వెలుతురు బాగా వచ్చేలా ఏర్పాటు చేస్తున్నాం.

ఈ మార్పులు శాస్త్రసమ్మతమే..



గతంలో స్వామివారి ఆలయంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేవారు. వివిధ కారణాలతో అవన్నీ నిలిచిపోయాయి. ఇప్పుడు ఈఓ అజాద్ వాటిని పునరుద్ధరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అనేక మార్పులు చేపడుతున్నారు. ఇవన్నీ శాస్త్రసమ్మతమే. దర్బారు మంటపంలో ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించేలా చేయడం పాత సంప్రదాయాన్ని పునరుద్ధరించడమే. అక్కడ స్వామి, అమ్మవార్లకు భక్తులు అష్టోత్తర, సహస్రనామార్చన చేయించుకునేలా ఏర్పాట్లు చేయాలి.

– నాగాభట్ల కామేశ్వరశర్మ, దేవస్థానం విశ్రాంత ఆగమ సలహాదారు

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం


మెట్టి ధర్మయ్య (ఫైల్)

కొత్తపేట: వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు అదనపు ఎస్సై డి.శశాంక తెలిపారు. స్థానిక బాబానగర్‌కు చెందిన 70 ఏళ్ల మెట్టి ధర్మయ్య గత నెల 30 నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయింది. గతంలో పలుమార్లు ఇంటినుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజుల్లో తిరిగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఈసారి వారం రోజులైనా రాకపోవడంతో ధర్మయ్య భార్య మంగాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు రావులపాలెం సీఐ 94407 96527, కొత్తపేట ఎస్సై 94409 04842 సెల్ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొత్తపేట: చెడు వ్యసనాలకు బానిసై డబ్బు పోగొట్టాననే మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వి.మణికుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గంటి పల్లిపాలెం గ్రామానికి చెందిన చీకురుమిల్లి సాత్విక్ (19) ఇంటర్మీడియెట్ పూర్తిచేసి ఎలక్ట్రికల్ వర్క్ నేర్చుకుంటున్నాడు. అనారోగ్యానికి గురైన అతడి తాత ఆపరేషన్ కోసం దుబాయ్‌లో ఉంటున్న మేనత్త పెనుమల ధనలక్ష్మి సుమారు రూ.70 వేలను సాత్విక్ బ్యాంక్ ఖాతాకు పంపించింది. చెడు వ్యసనాలకు బానిసైన సాత్విక్ ఆ డబ్బును తన అవసరాలకు ఖర్చుచేసి పోగొట్టాడు. దీంతో తాత ఆపరేషన్‌కు డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. వేలాడుతున్న సాత్విక్‌ను అతడి తమ్ముడు చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లి వద్ద ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి రేకాడి శ్రీను (40) మృతి చెందాడు. స్థానిక వీఆర్‌ఓ సాయి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీను చేపల వేట సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం గోదావరిలో చేపల వేటకు వెళ్లి రాత్రి సమయంలో చేపలు పడుతుండగా కాలు జారి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో రేవు వద్ద ఉన్న గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా శ్రీను జాడ తెలియలేదు. మంగళవారం ఉదయం గోదావరి ఒడ్డున మృతదేహం తేలడంతో వీఆర్‌ఓ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడిగా భార్య, కుమారుడు ఉన్నారు.

ప్రతిభ ఉంటే ఉజ్వల భవిత

- క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు వేళాయె
- 4, 5 తరగతులకు ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కడప జిల్లాలో క్రీడా పాఠశాలను నిర్వహిస్తోంది. ఇక్కడ నాలుగో తరగతిలో ప్రవేశాలు కల్పించి ఎంపికైన వారికి విద్య, వసతి, క్రీడాశిక్షణ ఉచితంగా అందించి మంచి క్రీడాకారులుగా తయారు చేస్తారు. ప్రతి ఏడాదీ జూన్, జూలై మాసాల్లో ఎంపికలు నిర్వహిస్తారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపికలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ప్రారంభం కానున్నాయి.

రాష్ట్రంలో ఏకైక క్రీడా పాఠశాల

రాష్ట్రంలోని ఏకైక క్రీడాపాఠశాల డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. ఎందరో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులను దేశానికి అందించిన ఘనత ఈ పాఠశాలదే. ఇక్కడ ప్రవేశం లభించాలంటే మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని రావాల్సి ఉంటుంది. ఆర్చరీ, అథెటిక్స్, బాక్సింగ్, హాకీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ అంశాల్లో శిక్షణ ఇస్తారు.

వీరు అర్హులు

రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా పుట్లంపల్లిలో డాక్టర్ వైఎస్సార్ రాష్ట్ర క్రీడా పాఠశాలను శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రవేశానికి 3వ తరగతి ఉత్తీర్ణులై నాలుగులోకి వచ్చిన వారు, అలాగే 4వ తరగతి ఉత్తీర్ణులై ఐదులోకి వచ్చిన వారు అర్హులు. వయసు 8 నుంచి 9, అలాగే 9 నుంచి 10 ఉండాలి. 4వ తరగతిలో ప్రవేశానికి 20 సీట్లు బాలురు, 20 సీట్లు బాలికలకు చొప్పున 40 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారు. ముందుగా మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి అక్కడ ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లాస్థాయి ఎంపికలు జిల్లా కేంద్రంలో జరుగుతాయి. అక్కడ చక్కటి ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ తుది ఎంపికలు నిర్వహించి 40 సీట్లకు విద్యార్థులకు ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా, ఎంఆర్‌వో, ఎంఈఓ, మండల హెడ్ క్వార్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సభ్యులుగా, మండస్థాయి పీఈటీ లేక పీడీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఎస్‌ఏ చీఫ్ కోచ్, సీనియర్ కోచ్ సభ్యులుగా, డీఎస్‌ఏ సీఈఓ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

షెడ్యూల్

మండల స్థాయిలో జూన్ 15 నుంచి 20 వరకూ ఆయా మండల కేంద్రాలలో, జిల్లా స్థాయిలో జూన్ 23న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో, రాష్ట్ర స్థాయిలో జూన్ 29, 30 తేదీలలో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంపికలు జరుగుతాయి.

ఎంపిక విధానం

ఆన్‌త్రోపో మెట్రిక్ పరీక్షల్లో ఎత్తు, బరువు చూసి ఎంపిక చేస్తారు. మోటార్ క్వాలిటీ పరీక్షల్లో 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 60 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, 1కేజీ మెడిసిన్ బాల్, 800 మీటర్ల పరుగు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో 21 మార్కులకు, రాష్ట్రస్థాయిలో 27 మార్కులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే వయసు వెరిఫికేషన్, పోస్చర్, బాడీ ఎబ్‌నార్మాలిటీస్, ఫ్లాట్ ఫీట్, స్పైనల్ డిజార్డర్స్, హార్ట్ ప్రాబ్లమ్స్ మొదలైనవి పరీక్షిస్తారు.

సమర్పించాల్సిన పత్రాలు

రాష్ట్ర క్రీడాపాఠశాలకు ఎంపికైన విద్యార్థులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్, కేస్ట్ సర్టిఫికెట్, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 20 రూపాయల స్టాంప్‌పై అఫిడవిట్ సమర్పించాలి.



వైఎస్సార్ కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల ముఖద్వారం


ఆర్చరీ ఫీల్డ్


స్విమ్మింగ్ పూల్

అన్ని వసతులు

పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర సిలబస్‌లో ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తారు. డిజిటల్ క్లాస్ రూంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఆయా సబ్జెక్టులు బోధిస్తారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో డిప్లమో, ఆరువారాల కోర్సు చేసిన శిక్షకులు ఆయా క్రీడల్లో శిక్షణ అందిస్తారు. అన్ని వసతులతో బాలురకు, బాలికలకు వేర్వేరు హాస్టళ్లు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు అసెంబ్లీ, 6 నుంచి 8.45 వరకు, సాయంత్రం 4 నుంచి 6.45 గంట వరకూ శిక్షణ ఉంటుంది.

గొప్ప అవకాశం



క్రీడా పాఠశాలలో ప్రవేశం దొరకడం గ్రామీణ క్రీడాకారులకు గొప్ప అవకాశం. చిన్న వయసులోనే వారిలోని క్రీడా నైపుణ్యాలను గుర్తించడంతో పాటు వారికి విద్య, వసతి, క్రీడాశిక్షణ ఉచితంగా అందిస్తూ, ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ఈ పాఠశాల ముఖ్య ఉద్దేశం.

– షేక్ ఇమ్రాన్, డీఎస్‌ఏ సీఈఓ

ఎంపికలకు ఏర్పాట్లు



కలెక్టర్, డీఎస్‌ఏ చైర్మన్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 20 వరకూ మండల స్థాయి ఎంపికలు 21 మండల కేంద్రాలలో, 23న జిల్లాస్థాయి ఎంపికలు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతాయి. వాటి నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం.

– శ్రీనివాస్ కుమార్, డీఎస్‌ఏ ముఖ్యశిక్షకులు

పర్యావరణ హితంగా జీవించాలి

- నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు
- వర్సిటీలో ప్లాస్టిక్ ఫ్రీ ప్రోగ్రామ్ ప్రారంభం


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: పర్యావరణానికి తీవ్రహాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణ హితంగా జీవనాన్ని సాగించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు విద్యార్థులకు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే ప్లాస్టిక్ ఫ్రీ క్యాంప్ ప్రోగ్రామ్‌ను యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. గోదావరి జిల్లాల్లో తుపానులు, వరదలు సంభవించిన సమయంలో తాను విద్యార్థి దశలో ఉండగా ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ఉదహరిస్తూ విద్యార్థులకు వీసీ స్ఫూర్తినిచ్చారు. ప్లాస్టిక్ రహితంగా యూనివర్సిటీ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుదామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, యూనివర్సిటీ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో దారుణ హత్య


హత్యకు గురైన కామాక్షి నాగేశ్వరరావు

దేవరపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరపల్లిలోని యాదవోలు రోడ్డులో నివాసం ఉంటున్న కామాక్షి నాగేశ్వరరావు, కామాక్షి దుర్గాప్రసాద్ కుటుంబాల మధ్య గొడవలు ఉన్నాయి. తన భార్యకు దుర్గాప్రసాద్ కుమారుడితో అక్రమ సంబంధం ఉందని నాగేశ్వరరావుకు అనుమానం. ఈ రెండు కుటుంబాల మధ్య ఇటీవల గొడవలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నాగేశ్వరరావు తన అన్న దుర్గాప్రసాద్‌తో గొడవపడ్డారు. అనంతరం సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిద్రపోతున్న అతడిపై అర్ధరాత్రి 12 గంటల సమయంలో దుర్గాప్రసాద్ ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇవ్వగా, వారు వెంటనే అక్కడకు వచ్చి నాగేశ్వరరావును పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

పక్కాగా.. పారదర్శకంగా

- ఒక క్లిక్‌తో సమగ్ర సమాచారం
- జేఎన్‌టీయూకే ప్రత్యేక పోర్టల్ రూపకల్పన
- అందుబాటులో కళాశాలల వివరాలు


జేఎన్‌టీయూకే

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ఫలితాలు మరో వారం రోజుల్లో రానున్నాయి. ఫలితాల అనంతరం కోర్సు, కళాశాలలు తదితర వాటిని అన్వేషించే పనిలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు నిమగ్నమవుతారు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఉన్నత విద్యామండలి సూచనల మేరకు ఒక అడుగు ముందుకు వేసింది. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ (డీఏఏ) విభాగం ద్వారా ఒక వెబ్ పోర్టల్ ప్రారంభించి, అందులో వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి ఐదు జిల్లాల్లోని (తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం) ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలలు వివరాలు దానిలో పొందుపరిచింది.

అరచేతిలో సమాచారం

కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్ విద్యార్హతలు, ఉద్యోగంలో చేరిన తేదీ, నియామక ఉత్తర్వులు, ర్యాటిఫికేషన్ వివరాలు అప్‌లోడ్ చేశారు. ప్రిన్సిపల్ లేదా అధ్యాపకుడు మానేస్తే రిలీవింగ్ వివరాలు పోర్టల్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేశారు. ఇలా చేయని వారిని మరో కళాశాలలో చేరడానికి అనుమతించరు. ప్రతి అధ్యాపకుడికి యూనిక్ సంఖ్య కేటాయించడం ద్వారా ఒక అధ్యాపకుడిని మరో కళాశాలలో బోధన సిబ్బందిగా చూపించే అవకాశం ఉండదు. ముఖ్యంగా అనుబంధ కళాశాలలు వివిధ పద్దుల ద్వారా వర్సిటీకి చెల్లించే ప్రతి రూపాయి వివరాలు పోర్టల్ నుంచి అనుసంధానం చేశారు. అనుబంధ కళాశాలల నిర్వహణ వివరాలు పోర్టల్‌లో చూసుకోవడానికి వీలుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, సోషల్ పోలీసింగ్ ద్వారా అనుబంధ కళాశాలల అక్రమాలు నిలువరించడానికి అనువుగా ఉంటుందని వర్సిటీ అధ్యాపకులు చెబుతున్నారు. జేఎన్‌టీయూకే డీఏపోర్టల్‌డాట్‌ఒఆర్‌జీ పోర్టల్‌లో వివరాలన్నీ పొందుపర్చారు. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అలాగే ప్రతి అభ్యర్థి దరఖాస్తు, స్క్రూట్నీ చేసిన కమిటీ సభ్యుల వివరాలు తదితర అంశాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచి ప్రతి అభ్యర్థికి తెలిసేలా ఏర్పాట్లు చేశారు. ర్యాటిఫికేషన్ కాపీలు డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు.

వివరాలు ఉండేలా చర్యలు



వర్సిటీకు అనుబంధంగా ఉన్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు పారదర్శకంగా పనిచేసేందుకు ఉన్నత విద్యామండలి సూచనల మేరకు వీసీ ప్రసాదరాజు ప్రోత్సాహంతో పోర్టల్ ఏర్పాటు చేశాం. ఇందులో ఐదు జిల్లాల పరిధిలోని 120 ఇంజినీరింగ్, 30 ఫార్మసీ, 10 ఎంబీఏ, 2 ఆర్కిటెక్చర్ కళాశాలల పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. ర్యాటిఫికేషన్ నిర్వహించిన అధ్యాపకుల వివరాలతో పాటు గైడ్‌లెన్స్ కమిటీ, అకడమిక్ సెనెట్ కమిటీ సభ్యుల వివరాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సీహెచ్ సాయిబాబు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో సోమవారం రాత్రి జువ్వల కల్యాణ్ శ్రీనివాస్ (45) విద్యుదాఘాతంలో మృతి చెందాడు. వెల్దుర్తి రోడ్డులోని పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద అతడు మృతిచెంది ఉండటాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు, పోలీసులు పరిసరాలను పరిశీలించారు. ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై కల్యాణ్ శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంఖవరం: గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 2600 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, సీఐ రమేష్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. ఆ బియ్యాన్ని అన్నవరం ఎస్‌హెచ్‌ఓ పంపుతున్నట్లు తెలిపారు. బియ్యం వ్యాపారస్తుడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

మాస్టర్‌మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి 2023 పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర సిలబస్‌లో 550 మార్కులకు పైగా, సీబీఎస్‌ఈ 450 మార్కులకు పైగా సాధించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను 92487 22218, 91212 10582 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యకళావాహినిలో గురువారం సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

తాత్కాలికంగా 216 జాతీయ రహదారి మూసివేత

కాకినాడ రూరల్: రహదారి మరమ్మతులు జరుగుతున్నందున మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు, హైవే సూచనల మేరకు 216 బైపాస్ రోడ్డు చీడిగ నుంచి యానాం రోడ్డు వరకు ఉన్న రహదారిని 45 రోజులు తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విషయాన్ని చీడిగ వద్ద ఏర్పాటు చేసిన విజ్ఞప్తి బోర్డులో హైవే అధికారులు తెలిపారు. ఆగస్టు నాటికి మళ్లీ తెరుస్తామని, వాహనచోదకులు సహకరించాలని కోరారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలి


కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ తదితరులు

సాక్షి, అమలాపురం: రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను యథాతథంగా కొనసాగించాలంటూ ప్రజాప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేశారు. అమలాపురంలో రిజర్వేషన్ కౌంటర్ ప్రజలకు ఎంతో అవసరమని, దాని అవసరాలను, ప్రాధాన్యతను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ తెలియజేశారు. రైల్వే అధికారులతో చర్చించి అక్కడే రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మట్టపర్తి నాగేంద్ర, ఈఆర్ సుబ్రహ్మణ్యం, కల్వకొలను తాతాజీ, వాసంశెట్టి తాతాజీ, కడలి దుర్గాకృష్ణ, రైల్వే సాధన సమితి సభ్యులు ఉన్నారు.

తుది దశకు బదిలీ ప్రక్రియ

- ఉపాధ్యాయుల సీనియారిటీ, వేకెన్సీల తుది జాబితా విడుదల
- వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం


బదిలీ ఆప్షన్లు ఇస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీనికి సంబంధించి గత నెల 21న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. బదిలీల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,025 మంది ఉపాధ్యాయులు తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన చేపడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు తమ అర్హతలు, సర్వీస్, ప్రత్యేక కేటగిరీల ఆధారంగా పాయింట్లు పొందారు. బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఉపాధ్యాయులు పలు అంశాల్లో పాయింట్ల కోసం అర్జీలు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు, పాయింట్ల కేటాయింపులో వచ్చిన అర్జీలను నిరంతరం పర్యవేక్షిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఉపాధ్యాయుల దరఖాస్తులపై వచ్చిన పలు అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఫైనల్ సీనియారిటీ జాబితాలను విడుదల చేశారు. గ్రేడ్-2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీల సీనియారిటీ జాబితాలను, అలాగే వేకెన్సీ జాబితాలను విద్యాశాఖ విడుదల చేసింది.

ఉపాధ్యాయుల సంతోషం

గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఐదున ప్రారంభం కాగా, మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రేడ్-ఈ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 238 మంది ఉండగా, రిక్వెస్ట్ బదిలీలకు 123 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 361 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు.

పదోన్నతి పొందిన వారు సైతం

పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పలువురు ఉపాధ్యాయులు విల్లింగ్ ఇచ్చారు. వారికి సోమవారం రాత్రి పదోన్నతి ఉత్తర్వులను విడుదల చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు కూడా వెబ్ ఆప్షన్లను నిర్ణీత షెడ్యూల్‌లో ఇచ్చుకోవాల్సి ఉంది. పదోన్నతికి గ్రేడ్-2 హెచ్‌ఎంలకు 37, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 317, గణితం-193, బయలాజికల్ సైన్స్-134, పీఎస్-41, సోషల్ స్టడీస్-131, పీఈటీలు 27 మంది పదోన్నతి ఉత్తర్వులను పొందారు. వీరంతా బదిలీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది.

ఇదిలా ఉంటే స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లను బుధవారం రాత్రి 11.59 గంటల లోపుగా నమోదు చేసుకోవాలి. అలాగే ఎస్‌జీటీలు ఈ నెల 8వ తేదీ రాత్రి 11.59 గంటల లోపు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం బదిలీలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పక్కా ప్రణాళిక ప్రకారం చేపడుతున్నారు. దీనిపై ఉపాధ్యా యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.